సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 3 । ఆగస్టు । 2024



గర్భిణికి తప్పిన ప్రాణాపాయం

పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని డోలీలో మోసుకుని సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. IIలో



పంట కాలువకు గండి

భారీ వర్షాలకు వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువకు గండి పడింది. దీంతో సాగునీరంతా వృధాగా పోతోంది. IIలో



మెనూ కచ్చితంగా అమలు

మధ్యాహ్న భోజన పథకం మెనూను కచ్చితంగా అమలుచేయాలని ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ఆదేశించారు. IIలో

న్యూస్‌రీల్

నిబంధనలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీ

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న జేసీ అభిషేక్ గౌడ్

ఎటపాక: సామాజిక పింఛన్లను **నిబంధనలకు** అనుగుణంగా పంపిణీ చేస్తున్నట్లు **జాయింట్** కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ అన్నారు. **శుక్రవారం** లక్ష్మీపురంలో ఆయన దివ్యాం**గుడికి పింఛను** అందజేశారు. ఈ సందర్భంగా **జేసీ మాట్లా**డుతూ వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లను నేరుగా వారి ఇళ్లకు వెళ్లి అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సారె సమర్పణ



అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల సంతబయలు గ్రామంలోని మత్స్యమాడుగులమ్మ తల్లికి శుక్రవారం భక్తులు పిండి వంటలతో సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు. ఆలయ ధర్మకర్త మత్స్యరాస మత్స్యరాజు, చంద్రమణి దంపతుల అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంతబయలు, నేరేడువలస, పీజీ మాడుగులకు చెందిన మహిళలతోపాటు సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యుడు ఆతవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వలంటీర్ల వినతి



వలంటీర్ల వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: గత జూన్ నుంచి నిలిపివేసిన వేతనాలను చెల్లించాలని కోరుతూ మండలానికి చెందిన పలువురు వలంటీర్లు శుక్రవారం ఎంపీడీవో సీతయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో తమలో కొంతమంది మాత్రమే రాజీనామా చేశారన్నారు. రాజీనామా చేయని వారికి ఈ ఏడాది జూన్ నుంచి వేతనాలు రాలేదని వారు ఎంపీడీవోకు వివరించారు. గత కొన్నేళ్లుగా పేదలకు ఎంతో సాయం చేశామని, తమకు వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీడీవో సీతయ్య తెలిపారు.

జ్వరంతో చిన్నారి మృతి



భద్రాచలం తరలించడానికి ముందు చింతూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

చింతూరు: జ్వరంతో బాధపడుతున్న చిన్నారి మెరుగైన వైద్యంకోసం శుక్రవారం భద్రాచలం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. మండలంలోని చదలవాడకు చెందిన సొందల దేవిరెడ్డి, భద్రమ్మల ఆరునెలల చిన్నారికి జ్వరం రావడంతో బుధవారం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటినుంచి వైద్యులు చిన్నారికి వైద్యం అందిస్తున్నారు. అయితే శుక్రవారం ఆమె ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. దీంతో 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గంమధ్యలో మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

7న అధ్యాపక పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

దాబాగార్డెన్స్ (విశాఖ): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్)లో ఖాళీగా ఉన్న పీజీ అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజులా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వం పొగాకు ఆధారిత గుట్కా, ఖైనీ లాంటి ఉత్పత్తులపై నిషేధం విధించి ఏళ్లు గడుస్తున్నా జిల్లాలో మాత్రం దర్జాగా వ్యాపారం సాగుతోంది. జిల్లాలో 22 మండలాల్లోనూ గుట్టుగా గుట్కా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఒడిశా నుంచి వస్తున్న సరకు జిల్లావ్యాప్తంగా సరఫరా అవుతోంది. రోజుకు రూ.లక్షల్లో అక్రమ వ్యాపారం బహిరంగంగా జరుగుతోంది.

గుట్కా.. గుట్టు విప్పరేం..?



అరకుసంత ప్రాంతంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఖైనీ ప్యాకెట్లు

- ఒడిశా నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా
- భారీగా వ్యాపారం
- ఏజెన్సీ అంతటా డీలర్లు
- నిషేధం ఉన్నా పట్టించుకోని అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాకు సరిహద్దులో ఉన్న ఒడిశా నుంచి గుట్కా, ఖైనీ అక్రమ రవాణా భారీగా జరుగుతోంది. అదే రాష్ట్రంలోని కోరాపుట్టు, మల్కన్‌గిరి జిల్లాలకు చెందిన వ్యాపారులంతా ఖైనీ, గుట్కా ప్యాకెట్లను బాక్సలతో మినీ వ్యాన్లు,ఆటోల ద్వారా జిల్లాలో వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. ఇలా వ్యాపారం రోజుకు రూ.లక్షల్లో జరుగుతున్నప్పటికీ పోలీసు, సెబ్ అధికారులు చర్యలు తీసుకోవడం



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియాలో ఓ దుకాణం వద్ద అమ్మకానికి సిద్ధంగా గుట్కా ప్యాకెట్లు

లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బహిరంగంగా విక్రయిస్తున్నా..

జిల్లాలోని అరకులోయ, పాడేరు, చింతపల్లి, అరకు సంత, జి.మాడుగుల, అన్నవరం, లోతుగెడ్డ జంక్షన్, రంపచోడవరం, చింతూరు ప్రాంతాల్లో కొంతమంది బడా వ్యాపారులు గుట్కా, ఖైనీలకు హోల్‌సేల్ డీలర్లుగా వ్యవహరిస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి మండల కేంద్రాలు, గ్రామాలు, వారపుసంతల్లోని కిరాణా, పాన్‌షాప్‌లకు తరలిస్తూ గుట్కా వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. లాభాలు అధికంగా ఉండడంతో వ్యాపారులు తమ దుకాణాల్లో నిత్యావసర సామగ్రి మాదిరిగానే బహిరంగంగా విక్రయిస్తున్నారు.

పెరిగిన వినియోగం

జిల్లా వ్యాప్తంగా గుట్కా, ఖైనీల వినియోగం బాగా పెరిగింది. గతంలో వీటి అమ్మకాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ దాడులు చేపట్టి వ్యాపారులపై కేసులు నమోదు చేసేది. అయితే ఇటీవల కాలంలో ఒడిశా వ్యాపారులు తమ గుట్కా వ్యాపారాన్ని రెట్టింపు చేస్తున్నారు. గుట్కా, ఖైనీల వినియోగంతో ఆరోగ్యం చెడిపోతుందని, నోటి క్యాన్సర్ మరణానికి దారితీస్తుందని కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నా ప్రజల్లో స్పందన కనిపించడం లేదు. 14ఏళ్ల వయసు నుంచి యువకులు ఖైనీ, గుట్కాలకు అలవాటు పడి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు.

చిన్నాపెద్దా తేడా లేకుండా.. : చిన్నాపెద్దా తేడా లేకుండా పొగాకు ఉత్పత్తులకు ప్రజలు బానిసలయ్యారు. **జిల్లా కేంద్రమై**న పాడేరులోని కొంతమంది వ్యాపా**రులు గుట్కా,**ఖైనీల అమ్మకాలతో రూ.లక్షలు సంపా**దిస్తున్నారు.** ఒడిశా నుంచి రోజు భారీగానే **గుట్కా,ఖైనీ ప్యా**కెట్లు అక్కడి చెక్‌పోస్టులను దాటుకుని జిల్లాకు వస్తున్నాయి. ఇక్కడ కూడా తనిఖీలు నిర్వహించకపోవడం వ్యాపారులకు కలిసొస్తోంది. ఇప్పటికైనా పోలీసు, సెబ్ అధికారులు జిల్లా వ్యాప్తంగా దాడులు చేపట్టి ఖైనీ, గుట్కా అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ రవాణాపై నిఘా



ఒడిశా నుంచి జిల్లాకు అక్రమంగా రవాణా చేస్తున్న ఖైనీ, గుట్కాలపై నిఘా పెడతాం.గతంలో పాడేరుతో పాటు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి వ్యాపారులపై కేసులు నమోదు చేశాం. మళ్లీ రవాణా అధికమవుతున్న సమాచారంపై పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తాం. అక్రమ రవాణా, స్థానికంగా అమ్మకాలపై దృష్టి సారిస్తాం. ఒడిశా సరిహద్దు మార్గాల్లోను వాహన తనిఖీలను విస్తృతం చేస్తాం.

– కె.ధీరజ్, ఏఎస్పీ, పాడేరు

పింఛన్ల పంపిణీలో కోత

- డివైస్‌ల పేరిట ఒకొక్కరి నుంచి రూ.100 వసూలు
- పింఛనుదారుల ఆవేదన

అరకులోయ టౌన్: మండలంలోని మాదల గ్రామ పంచాయతీ పరిధిలో ఆగస్టు నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.రూతు చేతి డివైస్‌ల పేరిట వసూలు చేయడం విమర్శలకు తావిచ్చింది. పంచాయతీ పరిధిలోని మాదల, ముసిరిగుడ గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు చెల్లించాల్సిన పింఛన్ల మొత్తంలో ఒకొక్కరి నుంచి రూ.వంద వసూలు చేసినట్టు లబ్ధిదారులు ఆరోపించారు. డివైస్‌ల కొనుగోలుకు వసూలు చేసినట్టు వెల్ఫేర్ అసిస్టెంట్ చెప్పారని వారు తెలిపారు. ఈ పంచాయతీ పరిధిలో మొత్తం 415 మంది పింఛనుదారులు ఉండగా మాదలలో 32 మంది, ముసిరిగుడలో 27 మంది ఉన్నారు. గ్రామ సచివాలయంలో ఎనిమిది మంది సిబ్బంది ఉండగా కేవలం డివైస్‌లు మాత్రమే ఉన్నాయి. డివైస్‌ల కొనుగోలుకు వెల్ఫేర్ అసిస్టెంట్ రూతు రూ.100 చొప్పున వసూలు చేశారని వారు ఆరోపిస్తున్నారు. గతంలో గ్రామ వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు. వారు బాధ్యతల నుంచి తప్పుకున్న తరువాత కొంతమంది మాత్రమే డివైస్‌లు అప్పగించారు. అవి కూడా సరిగ్గా పనిచేయడం లేదని డిజిటల్ అసిస్టెంట్ వంతాల చిట్టిబాబు తెలిపారు. ఇలావుండగా పంచాయతీ డ్రాయింగ్ డిస్బాసింగ్ ఆఫీసర్ (డీడీవో), ఇన్‌చార్జి కార్యదర్శి రాంబాబు, టీడీపీకి చెందిన సర్పంచ్ శ్రీనివాసరావులకు డివైస్‌లు కొనుగోలు చేయాలని పలుసార్లు చెప్పినా స్పందన లేదని మాదల పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్ వంతాల చిట్టిబాబు తెలిపారు.

రూ.100 తీసుకున్నారు



ఆగస్టు నెలకు సంబంధించి పింఛను సొమ్ము రూ.4 వేలు ఇవ్వాల్సి ఉంది. ఇందులో రూ.100 తగ్గించి రూ. 3,900 ఇచ్చారు. ఎందుకు తగ్గించారని ప్రశ్నిస్తే డివైస్ కొనుగోలు కోసమని వెల్ఫేర్ అసిస్టెంట్ చెప్పారు. అందరి నుంచి ఇలాగే వసూలు చేశారు. డివైస్‌ల పేరిట పింఛనుసొమ్ము నుంచి రూ.100 తగ్గించడం అన్యాయం.

– జన్ని కమల, పింఛను లబ్ధిదారు, మాదల, అరకులోయ మండలం

రహదారిపైనే సోకిలేరు వరద



సోకిలేరు వాగులో పడవపై ప్రజల రాకపోకలు

చింతూరు: మండలంలోని సోకిలేరు వాగు వరద నీరు ఇంకా రహదారిపైనే నిలిచి ఉంది. దీంతో 15రోజులుగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శబరినది తగ్గినా సోకిలేరువాగుకు వరద ఉధృతి తగ్గక పోవడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య ఇంకా రాకపోకలు ప్రారంభం కాలేదు. ఇదే క్రమంలో చింతూరు మండలంలోని ముకునూరు, నర్సింగపేట, రామన్నపాలెం, బొడ్రాయిగూడెం, చిన్నసీతనపల్లి, పెద్దశీతనపల్లి, కొండపల్లి, తిమ్మిరిగూడెం, ఏజీకొడేరు, మల్లెతోట, ఉలుమూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వాగులు దాటాలంటే ప్రాణాలు తెగించాల్సిందే



ఆకూరు వద్ద వాగు దాటుతున్న గిరిజనులు

రంపచోడవరం: మండలంలోని ఆకూరు పంచాయతీ పరిధిలో కొంగవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వాటి అవతలి ఉన్న గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో గ్రామాలు దాటి రావాలన్నా.. అక్కడికి వెళ్లాలన్నా ప్రాణాలకు తెగించి వాగులు దాటాల్సిందే. ఆకూరు గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోవడంతో వర్షాకాలంలో ఆ ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటేందుకు సాహసం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇలావుండగా బడిగుంట గ్రామం చుట్టూ కొండవాగులు పొంగి ప్రవహిస్తుండటంతో జలదిగ్బంధంలో ఉంది. దీంతో తమకు రవాణా సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

గిరి యువతకు ప్రత్యేక ఉచిత శిక్షణ

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో బీఈడీ, డీఎడ్ ఉత్తీర్ణులైన గిరిజన యువతకు ఉద్యోగాలు పొందేందుకు ప్రత్యేక ఉచిత శిక్షణ ఇస్తామని స్థానిక ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడారు. ఏజెన్సీలోని గిరిజన యువతీ యువకులు డిగ్రీతోపాటు బీఈడీ, డీఎడ్ టెట్ పాసైన అభ్యర్థులకు రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. అదేవిధంగా ఏదైనా స్క్రీనింగ్ టెస్ట్ పాసైన వారు కూడా డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సదుపాయం కలదని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల మూడు నుంచి ఎనిమిది వరకు దరఖాస్తులు సమర్పించవచ్చనని తెలిపారు. వీటిని పరిశీలించిన అనంతరం 150 మందితో కూడిన ఫైనల్ మెరిట్ లిస్టు ఆగస్టు 14వ తేదీన ఐటీడీఏ కార్యాలయం నోటీస్ బోర్డ్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. వీరికి ఈనెల మూడవ వారం నుంచి సుమారు 90 రోజులపాటు ఇచ్చే శిక్షణకు ఉచిత భోజనం, వసతి వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వీరికి అనుభవజ్ఞులైన గిరిజన సంక్షేమ శాఖ సీనియర్ ఉపాధ్యాయులతో రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకుగాను అర్హత కలిగిన యువతీ యువకులు ఐటీడీఏ మెయిల్ ఐడీకిదరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు. అంతేకాకుండా రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్లో మేనేజర్‌కు నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. వివరాలకు 7569098197 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

సూరంపాలెం జలాశయానికి వరద తాకిడి

దిగువ ప్రాంతానికి 350 క్యూసెక్కుల విడుదల



గేటు నుంచి విడుదల అవుతున్న వరదనీరు

గంగవరం : మండలంలోని సూరంపాలెం జలాశయానికి వరద తాకిడి నెలకొంది. వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో శుక్రవారం ఉదయం ఒక గేటును ఐదు సెంటీమీటర్ల ఎత్తి వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి జువ్వమ్మ కాలువ, ఆముదాలబంద, కుసుమరాయి పెద్దకాలువలు పొంగి ప్రవహించడంతో జలాశయంలోకి భారీగా వరదనీరు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 105 మీటర్లకు మించి వరద నీరు చేరడంతో శుక్రవారం ఉదయం ఒక గేటు నుంచి సుమారు 350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ ఏడాది సాగునీటికి ఢోకా లేదని ఆయకట్టుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కన్నేరు, జువ్వమ్మ, నెల్లిపూడి వాగు, పెద్దకాలువ, చప్పన్నగెడ్డ, కుసుమరాయి కాలువలు జోరుగా ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నెల్లిపూడి బ్రిడ్జి వద్ద ఇప్పటికే పోలీసు, రెవెన్యూ సిబ్బంది గస్తీ ఉంటున్నారు.

వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అందరివాడు బొత్స



ఆయన పేరు బొత్స సత్యనారాయణ.. కానీ అందరూ ఆయనను అభిమానంగా సత్తిబాబు అని పిలుచుకుంటారు. విభిన్నమైన నాయకుడు బొత్స. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించారు. అన్నిటి కంటే అందరివాడుగా పేరు పొందడమే ఆయనకు పెద్ద అలంకారం. సామాన్యులు వెళ్లి తమ కష్టం చెప్పినా ఆయన వెంటనే స్పందించి వారి సమస్య పరిష్కరిస్తారని ప్రతిపక్షంలోని వారు సైతం చెప్పుకునే మాట. అలాంటి నాయకుడిని ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లా నాయకుల సమావేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకున్న పార్టీ అధినేత బొత్సను అభ్యర్థిగా ప్రకటించారు.

- విద్యార్థి నాయకుడి నుంచి మంత్రిగా ఎదిగిన నాయకుడు
- వైఎస్సార్, జగన్ క్యాబినెట్లలో మంత్రిగా తనదైన ముద్ర

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ సీనియర్ నాయకుడు. బలమైన ప్రజా మద్దతుతో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఎలాంటి వివాదాన్నయినా సామరస్యంగా పరిష్కరించగల నేతగా పేరు. విశాఖ అభివృద్ధి కోసం.. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న యూనియన్ సంఘాలకు తన మద్దతు పలికారు. అంతేకాకుండా తన సతీమణి ఎంపీగా ఉన్న సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ గురించి ఆనాడు పార్లమెంట్‌లో గళం వినిపించేలా చేశారు. గాజువాక అల్లుడిగా ఈ ప్రాంతంతో మరింత అనుబంధం బొత్స సత్యనారాయణకు ఉంది.

విద్యార్థి నాయకుడి నుంచి మంత్రిగా..

విజయనగరంలో బొత్స గురునాయుడు, ఈశ్వరమ్మ దంపతులకు 1958లో బొత్స సత్యనారాయణ జన్మించారు. ఆయన మహారాజా కళాశాలలో బీఏ డిగ్రీ పూర్తి చేశారు. ఆయన 1985లో బొత్స ఝాన్సీలక్ష్మీని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అబ్బాయి సందీప్, అమ్మాయి అనూష. రాజకీయ జీవితం విద్యార్థి దశ నుంచే ప్రారంభమైంది. 1978లో విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చి అంచలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ లీడర్‌గా ఎదిగారు. ఆయన 1992 నుంచి 99 వరకు రెండుసార్లు విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. 1999లో బొబ్బిలి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఆనాడు ఎన్డీయే హవా వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి కేవలం ఐదుగురు ఎంపీలే గెలవగా అందులో బొత్స ఒకరు. 2004, 2009లలో చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రధాన అనుచరుడిగా ఆయనకు పేరుంది. ఆయన వైఎస్సార్, రోశయ్య , కిరణ్ కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతర పరిణామాలతో 2014లో ఓడిపోయారు. దీంతో 2015లో కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన బొత్స సత్యనారాయణ తన మద్దతుదారులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. 2019 చీపురుపల్లి నియోజకవర్గం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా కూడా ఆయన పనిచేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక హర్షణీయం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేయడం హర్షణీయమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. పార్టీకి అండగా నిలబడే వారికి ఎప్పుడూ మంచి స్థానం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. బొత్స సత్యనారాయణ అభ్యర్థిత్వంపై ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని, ముఖ్యంగా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు అంతా కలిసికట్టుగా పనిచేసి ఆయనను గెలిపించి తీరుతామన్నారు.ఎంపీపీ సీతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విజయవంతంగా తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్



అంబులెన్స్ సేవలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు

కలెక్టర్ దినేష్‌కుమార్


సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోను తల్లిపాల ఆవశ్యకత, శిశువుల సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్వో పద్మావతి, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు ప్రారంభం

హెచ్‌పీఎల్ సంస్థ పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రికి అందుబాటులో తెచ్చిన అంబులెన్సును కలెక్టర్ దినేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా,డీఐవో సాధన, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

ఈనెల 15వతేదీన స్వాతంత్ర్య దినోత్సవాలన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అన్నిశాఖల అధికారులతో ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. తలారిసింగి క్రీడా మైదానంలో నిర్వహించే ఈ వేడుకకు అన్నిశాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ అధికారులు, ఉద్యోగులను ఉత్తమ పురస్కారాలకు ఎంపిక చేయాలని ఆయన ఆదేశించారు.



జిల్లా కేంద్రమైన పాడేరులో శుక్రవారం ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఒక పక్క చిరుజల్లులు, మరోపక్క అలుముకున్న మేఘాలతో ప్రకృతి పులకరించింది. ఈ అపురూప దృశ్యం స్థానికులను కనువిందు చేసింది.

– సాక్షి, పాడేరు

క్లుప్తంగా

గర్భిణికి తప్పిన ప్రాణాపాయం

- డోలీలో ఆస్పత్రికి తరలింపు

సాక్షి,పాడేరు: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి డోలీలో సురక్షితంగా తరలించారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మారుమూల దిగసంపలు గ్రామంలో పాంగి చినతల్లి అనే గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతోంది. గ్రామానికి వాహనం వెళ్లే మార్గం లేకపోవడంతో ఆమెను డోలీలో మూడు కిలోమీటర్ల మేర గ్రామ గిరిజనులు మోసుకుంటూ తారురోడ్డు వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రిలోని తల్లీపిల్లల విభాగంలో చేర్పించారు. వెంటనే ఆమెకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వైద్యం అందిస్తుండటంతో ప్రాణాపాయం తప్పింది.

మెనూ కచ్చితంగా అమలు

గంగవరం : పాఠశాలల్లో పీఎం పోషణ మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం సీహెచ్ నెల్లిపూడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఇతర రికార్డులను ఆయన పరిశీలించారు. వివిధ తరగతులను సందర్శించి ఉపాధ్యాయుల పాఠ్యాంశ బోధనను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వారి విద్యా ప్రగతిని పరిశీలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పిల్లలు వర్షంలో తిరగకుండా చూడాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు.

'సావిత్రి క్లాసిక్స్' అందమైన పుస్తకం

సీతంపేట : ప్రముఖ సినీ చరిత్రకారుడు సంజయ్ కిషోర్(హైదరాబాద్) రచించిన సావిత్రి క్లాసిక్స్ పుస్తక పరిచయ సభ శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుస్తక రచయిత సంజయ్‌కిషోర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ సావిత్రి క్లాసిక్స్ పుస్తకం బ్లాక్ అండ్ వైట్ చిత్రాల రోజులను ఎందుకు స్వర్ణయుగం అంటామో ఈ పుస్తకం చదివితే అర్థం అవుతుందన్నారు. సినీ నటి సావిత్రి నటించిన పౌరాణికాలు, జానపదాలు, సాంఘిక చిత్రాలు వేర్వేరు అధ్యాయాలుగా విభజించి వివరించామన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈ పుస్తకం సావిత్రి అంత అందంగా ఉందని, ఆమె అభిమానులకు ఈ పుస్తకం ఒక పండుగే అని అభివర్ణించారు.

● వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మన్యం నేతలు



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అల్లూరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు తాడేపల్లిలో శుక్రవారం కలిశారు. అరకులోయ, పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఎంపిక చేయడంపై వారు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థికి అభినందనలు తెలిపారు.

అధికారుల తీరుపై ధ్వజం

- అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలి
- సర్పంచులు, ఎంపీటీసీలను అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదు
- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- మండల స్థాయి అధికారులపై సభ్యుల ఆగ్రహం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో నిబంధనల ప్రకారం సర్వసభ్య సమావేశం



తుపాను నష్టాలపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను పంచాయతీ స్థాయిలో జరిగే కార్యక్రమాలు, సమావేశాలకు సమాచారం ఇవ్వకుండా మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని 23 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిబంధనలు పాటిస్తూ సభను నిర్వహించారు. వైద్య ఆరోగ్య, వ్యవసాయశాఖ, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పనితీరుపై సభలో గంటల పాటు చర్చ జరిగింది. ముఖ్యంగా తుపాను కారణంగా కలిగిన నష్టాల అధికారలు సక్రమంగా స్పందించలేదని, నష్టాలపై అంచనా వేయడంలో విఫలమయ్యారంటూ సభ్యులంగా అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. ముఖ్యంగా మండల కేంద్రంలో సీహెచ్‌సీలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడ్డారంటూ సభ్యులు విద్యుత్‌శాఖ అధికారులపై మండిపడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి అంటూ వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు సర్పంచులు, ఎంపీటీసీలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలని, శాఖల వారీగా జరిగే ప్రతి కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు.వర్షాకాలంలో వైద్యశాఖ అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. పంట నష్టాలపై పూర్తి సమాచారం సేకరించి, బాధితులకు న్యాయం చేయలన్నారు. గర్భిణీలు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రంగబయలు, పెదగూడ పంచాయతీల్లో పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని సర్పంచులు తెలియజేయడంతో ఆమె ప్రస్తావిస్తూ ఆయా పంచాయతీలో ఉపాధ్యాయులు విధులపై ఎంఈవో కృష్ణమూర్తి దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర, సీడీపీవో వరహాలమ్మ, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, పీఆర్ ఏఈ గోపాలకృష్ణ, ఏపీఎం దేవమంగ, వైద్యాధికారులు గీతాంజలి,రమేష్, పశువైద్యాధికారి సౌజన్య దేవి, పలు శాఖాల అధికారులు పాల్గొన్నారు.

14న గాంధీదాం-పూరీ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు, మరికొన్ని రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. 14న గాంధీదాం-పూరీ(22973) ఎక్స్‌ప్రెస్, 17న పూరీ-గాంధీదాం(22974) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

◆ ఈ నెల 1, 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29వ తేదీల్లో అలప్పుజ-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ వయా పొదనూర్, ఇరుగూర్, సూరత్‌కల్ మీదుగా, ఎర్నాకుళం-టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్ వయా పొదనూర్, కొయంబత్తూర్, ఇరుగూర్ మీదుగా నడుస్తాయి. ◆ 6, 10, 11, 13, 14, 15, 18వ తేదీల్లో విశాఖపట్నం-నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది. ◆ 8, 12, 13, 15, 16, 17, 20వ తేదీల్లో నిజాముద్దీన్-విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, బల్హారాష, విజయవాడ మీదుగా నడుస్తుంది. ◆ 18న విశాఖపట్నం-ఎల్టీటీ(22847) ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది. ◆ 20న ఎల్టీటీ-విశాఖపట్నం(22848) ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, బల్హార్ష, విజయవాడ మీదుగా నడుస్తుంది.

పంటకాలువకు గండి

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేటలో గల వట్టిగెడ్డ రిజర్వాయర్ పంటకాలువకు శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఒకటవ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద గండి పడింది. దీంతో కాలువలోని సాగు నీరు వృథాగా దిగువకు పోతోంది.

మరోవైపు వరినాట్లు పడుతున్న సమయంలో ఈ విధంగా పంటకాలువకు గండి పడటంతో రిజర్వాయర్‌పై ఆధారపడిన మూడు వేల ఎకరాలకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ గండి రాను రాను విస్తరించే ప్రమాదం వుందని రైతులు అంటున్నారు. సంబంధిత మైనర్ ఇరిగేషన్ అధికారులు వెంటనే గండి పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంత రైతులు కోరుతున్నారు.

గంజాయి కేసులకు ప్రత్యేక కోర్టు

నర్సీపట్నం: గంజాయి కేసులకు నర్సీపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని శుక్రవారం వారు మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. నర్సీపట్నంలో జిల్లా స్థాయి బెంచ్ ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలను విస్తరించాలని కోరారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ మెట్టా ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కోసూరి అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు పొక్కునూరు నరసింహం, కామిరెడ్డి అప్పలనాయుడు, రుత్తల అప్పారావు, కామిరెడ్డి సత్యనారాయణ, అనిమిరెడ్డి గోవిందరావు, లోకా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



విశాఖ విద్య: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందేందుకు ఆసక్తి, అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక ఉంటుందన్నారు. అర్హులైన వారు ఈ నెల 5 లోపు దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఏపీ పేరెంట్స్ కమిటీ



కొక్కిరాపల్లి గురుకులంలో విద్యార్థినులకు బహుమతులు ఇస్తున్న పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: మండలంలోని కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని ఆంధ్రప్రదేశ్ పేరెంట్ అసోసియేషన్ (ఏపీపీఏ) కమిటీ శుక్రవారం సందర్శించింది. ఇక్కడ ఐదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ 2023-24 సంవత్సరంలో అధిక మార్కులు సాధించిన బాలికలకు బహుమతులు ప్రదానం చేసింది. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గురుకులం విద్యార్థినుల ప్రతిభ ఉందని కమిటీ సభ్యులు అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య గురుకులాల ద్వారా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. విద్యార్థినులంతా బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వాతంత్య్ర సమరయోధుడు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుకులం ప్రిన్సిపాల్‌ఎం మాణిక్యంను అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పేరెంట్ అసోసియేషన్ (ఏపీపీఏ) కమిటీ వ్యవస్థాపకుడు పిల్లా చంద్రం, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పి. రాము, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వై. పాండురంగ, విద్యార్థినుల తల్లిదండ్రులు, గురుకులం బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో షూటింగ్ సందడి



లొకేషన్‌లో హీరో ప్రియదర్శి

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు, రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి హీరో ప్రియదర్శి, నటుడు, దర్శకుడు తనికెళ్ల భరణి, వెన్నెల కిశోర్‌పై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. మరో వారం రోజుల పాటు ఆర్.కె.బీచ్-భీమిలి బీచ్ ప్రాంతాల్లో ఈ చిత్రం షూటింగ్ ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పద్మనాభం: విజయానందపురంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో గడ్డి నివారణ మందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ..ఈ గ్రామానికి చెందిన పాలెపు అప్పలరాజు(56) కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. వీటికి తాళలేక ఈ నెల ఒకటో తేదీన గడ్డి నివారణకు ఉపయోగించే మందు తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఆయన విజయనగరం అరుణా జ్యూట్ మిల్లు సమీపంలోని కార్ల షోరూంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

శరవేగంగా విజయవాడ- విశాఖ ట్రాక్ పనులు

అనకాపల్లి: అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో వివిధ విభాగాలను విజయవాడ నుంచి వచ్చిన డివిజినల్ ఏడీఆర్‌ఎం ఎస్.శ్రీనివాసరావు కొండ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి విశాఖ రైల్వే ట్రాక్ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, ఈ కారణంగా ఈ మార్గంలో కొన్ని రైళ్లు నిలుపుదల చేశామని చెప్పారు. ఈనెల 10న నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రైళ్లు పునరుద్ధరిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్టేషన్ మేనేజర్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'లో 131 వినతుల స్వీకరణ



గిరిజనుల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు గ్రామాలకు చెందిన గిరిజనుల నుంచి 131 వినతులను కలెక్టర్ దినేష్‌కుమార్ స్వీకరించారు.

- అనంతగిరి మండలం బొర్రా వద్ద నిలిచిపోయిన జిప్‌లైన్‌ను పునరుద్ధరించి, నిర్వహణ బాధ్యతను స్థానిక సొసైటీకి అప్పగించాలని ఎంపీటీసీ కె.అరుణ, బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు, ఇతర ప్రతినిధులు రవి,డానియేల్‌లు కోరారు.
- పెదబయలు మండలం రూడకోట పంచాయతీ పెదకొండ గ్రామానికి రహదారి నిర్మించాలని పాంగి మన్మథరావు, పి.గణపతిరావు కోరారు.
- అనంతగిరి మండలంలోని బిష్టుంగుడ గ్రామానికి చెందిన కిల్లో చంద్రశేఖర్ పుట్టగొడుగుల యూనిట్‌కు రూ.3లక్షల రుణం మంజూరు చేయాలని, చిలకలగెడ్డ పంచాయతీ దాసరితోట గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని డి.నాగమణి, సీతమ్మ కోరారు.

గిరిజనుల నుంచి స్వీకరించిన వినతులన్నింటిని పరిశీలించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్వో పద్మావతి, ఎస్‌డీసీ శర్మ, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చెరకు సాగుతో ఆర్థికాభివృద్ధి



రైతులకు వ్యవసాయ సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

హుకుంపేట: చెరకు రైతుల అభివృద్ధికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కృషి చేస్తోందని, గిరిజన రైతులు చెరకు పంట పండించేందుకు ఆసక్తి చూపించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి చెప్పారు. మండలంలోని మత్స్యపురం పంచాయతీ కేంద్రంలో గిరిజన రైతులకు చెరకు సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెరకు సాగుపై యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రైతులకు ఎరువులు(యూరియ, పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్పేట్, వర్మీ కంపోస్ట్,విలువ జోడించిన గత్తం), కలిపు మందులు జీవనియంత్రణ కారకాలు, స్ప్రేయర్లు, చెరకు రసం బకెట్లు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరకు పంట సాగు చేయడం వలన గిరిజనులు మంచి ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. చెరకు పంట పండించేందుకు రైతులు ఎక్కువగా ఆశక్తి చూపించాలని కోరారు. శాస్త్రవేత్తలు డాక్టర్ చరిత, శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రదీప్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు లీలావతి, విజయలక్ష్మి, సర్పంచ్ పూజారి మేరి సుబ్బారావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సాహసం

రోప్ సాయంతో గెడ్డలు దాటి వెళ్లి పింఛన్ల పంపిణీ



గిన్నెలకోట గెడ్డను ప్లాస్టిక్ రోప్ సాయంతో దాటుతున్న గ్రామ సచివాలయ సిబ్బంది

పెదబయలు : మండలంలోని గిన్నెలకోట, జామిగుడ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీకి గ్రామ సచివాలయ సిబ్బంది సాహసం చేయాల్సి వచ్చింది. గిన్నెలకోట పంచాయతీలో గిన్నెలకోట గెడ్డ అవతల తొమ్మిది, జామిగుడ పంచాయతీలో గుంజివాడ గెడ్డ అవతల ఆరు గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న గిన్నెలకోట గెడ్డను గ్రామ సచివాలయ సిబ్బంది ప్లాస్టిక్ రోప్ సాయంతో దాటి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రాణాలకు తెగించి గెడ్డదాటి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్లు సురేష్‌కుమార్, కుమారి, డీఏ చిన్న సూరిదొర, కార్యదర్శి మాధవరావు, సర్వేయర్ బాలన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాణిని రాష్ట్ర ఎస్ఈఆర్ఎఫ్ అధికారులు, జిల్లా అధికారులు ప్రశంసించారని మండల పరిషత్ ఏవో తెలిపారు. ఇలావుండగా గుంజువాడ గెడ్డను కూడా దాటేందుకు జామిగుడ గ్రామసచివాలయ సిబ్బంది సాహసం చేయాల్సి వచ్చింది.

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం

- సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు



శ్రీకృష్ణాపురం గురుకులం లైబ్రరీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ కన్నబాబు

ఆరిలోవ: సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు శుక్రవారం శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని విద్యార్థుల వసతి, తరగతి గదులు, భోజన శాల, గ్రంథాలయం, ఆర్ట్ గ్యాలరీని పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించి.. అందుబాటులో ఉన్న పుస్తకాల గురించి ఆరా తీశారు. గురుకులంలో నెలకొన్న సమస్యలు, అవసరమైన సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్ రత్నవల్లిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బంది సమావేశయ్యారు. ప్రస్తుతం బోధన విధానంలో వచ్చిన మార్పులు, సీబీఎస్‌సీ విధానంలో ఏ విధంగా బోధన సాగించాలో వివరించారు. గురుకులాల్లో 100 శాతం ఫలితాలు సాధించే విధంగా అధ్యాపకులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. విద్యా బోధన, ఫలితాలు సాధించడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు, విద్యా సామగ్రిని విద్యార్థులకు అందించాలన్నారు.

100 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం భారీ జెండా (100 అడుగులు)ను ప్రదర్శించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ఆంధ్ర తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ పలువురు ప్రముఖులు ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ నుంచి రాణిబొమ్మ వరకు భారీ జెండా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్‌అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింగళి వెంకయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని, వెంకయ్య విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఎన్నికల హామీలపై పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో అనేక హామీలపై పోరాటాలకు వెళ్లాల్సి వస్తోందని, అధికారంలోకి రావడం కోసం మతోన్మాదాన్ని రెచ్చగొట్టే పద్ధతిని ఎంచుకున్న బీజేపీ మూడోసారి పూర్తిస్థాయి మెజారిటీ రాకపోవడంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. విశాఖలో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. 4న మదనపల్లెలో సీపీఐ రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఐ శతాబ్ది వేడుకలు డిసెంబర్ 26 ప్రారంభమై ఏడాది పాటు జరుగుతాయన్నారు. ఇండియా కూటమి బీజేపీకి గట్టిపోటీ ఇచ్చిందన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీజేపీ వ్యతిరేకులపై ఈడీ, ఐటీ, సీబీఐలను ప్రయోగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడాన్ని సీపీఐ ఖండిస్తోందన్నారు.సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఏజే స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎ.విమల, ఎం.మన్మథరావు, జి.రాంబాబు, కె.సత్యాంజనేయ, ఆర్ శ్రీనివాసరావు, ఎస్కే రహ్మాన్, పి.చంద్రశేఖర్, జీఎస్‌జే అచ్యుతరావు, సీఎన్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.